

కథ

# పంతం ప్రేమయిన వేళ

''కొంచెమైనా బాధ్యత తెలీకుండా ఎలా పెంచారో నీ తల్లిదండ్రులు. జీవితాంతం భరించమని నాకొదిలేసారు. సంసారమంటే బొమ్మలాటలా కనబడుతోందా నీకు? డబ్బులంటే చిల్లపెంకులనుకుంటున్నావా?'' అసహనంగా అరుస్తున్న భర్తను చేతలుడిగిన దానిలా చూస్తూ నిలబడింది మాధవి.






'మిన్ను విరిగి మీదపడ్డట్టు ఎందుకింత హైరానా పడుతున్నాడు. తనేం కాని పని చేసిందని ఈ హంగామా?' మనసులో అనుకుంది. పైకి అనేటంత ధైర్యం లేదు ఆమెకి.

''భార్యంటే సంసారాన్ని ఎంతో పొదుపుగా తీర్చిదిద్దుకోవాలి. అంతేగానీ అనవసరపు ఖర్చులు చెయ్యకూడదు. అయినా డబ్బు విలువ తెలిసేలా పెంచారా మీ అమ్మానాన్నలు?'' ఇంకా ఏదేదో అంటున్నాడు రవి.

''ఇప్పుడు మా అమ్మానాన్నల నెందుకు ఆడిపోసుకుంటారు? నేనేమంత తప్పు చేశాను?'' మెల్లగా, ధైర్యాన్ని కూడగట్టుకుని అడిగింది మాధవి.

''ఓహో! అమ్మానాన్నల్ని ఏమన్నా అంటే చాలు పొడుచుకొచ్చేస్తుంది పౌరుషం. నేనన్న దాంట్లో తప్పేం ఉంది? నువ్వు చేసింది అక్షరాలా తప్పే''

రంకెలు వేస్తున్న దున్నపోతును గుర్తుచేస్తోంది అతని ప్రవర్తన.

''పోనీ పుస్తకాలు తిరిగి ఇచ్చెయ్యమంటారా?'' భయపడ్తూనే అడిగింది.

మళ్ళీ ఇంతెత్తున ఎగిరాడు రవి. కళ్ళల్లోకి కోపం బుసలు కొడుతూ వచ్చేసింది.

''అంటే నేను చేతకానివాడ్నని, మూర్ఖుడ్ననీ, డబ్బులు ఖర్చుపెట్టలేని పిసినారినని ఊరంతా తెలియాలా?'' అసహనంగా ఊగిపోతూ అడిగాడు.

''మరేం చెయ్యమంటారు? నేను చేసిన పని మీకు నచ్చలేదుగా'' అతని వాగ్ప్రవాహానికి అడ్డుపడుతూ అడిగింది.

''ఏం చెయ్యమంటారని మళ్ళీ అమాయకంగా అడుగుతున్నావా? ఒకటా, రెండా? ఐదు వందల రూపాయలు. ఎంత హ్యాపీగా ఖర్చుపెట్టేసావు. పోనీ పనికొచ్చేదేమైనా కొన్నావా? పుస్తకాలంట పుస్తకాలు!'' విసురుగా చేతులు తిప్పుతూ అంటున్నాడు.

''అదేమిటండీ! పుస్తకాలు అని అలా తీసిపారేస్తారు. ఎంతో విలువైన పుస్తకాలవి. ఎప్పటికైనా ఉపయోగపడ్తాయి'' మనసు చివుక్కుమనగా బాధగా అంది.

''దేనికి ఉపయోగపడ్తాయి? మళ్ళీ వాటి గురించి లెక్చరు ఇస్తున్నావా? దుబారా చేసిన డబ్బు విలువ నీకు తెలుసా అసలు? అయినా సంపాదించే వాళ్ళకు తెలుస్తుంది డబ్బు విలువ. నీకేం తెలుస్తుంది? ఇంట్లో కూర్చుని మొగుడు జీతం తెస్తుంటే జల్సా చేయడం బాగా తెలుసు'' ఎగతాళిగా అంటున్న అతని మాటలు విని మ్రాన్పడిపోయింది మాధవి.

తను జల్సా చేస్తోందా? అతని ఇష్టా ఇష్టాలు తెలుసుకుని, అతని అలవాట్లకు అనుగుణంగానే నడుచుకుంటోందే! తనకు డబ్బు విలువ తెలియదా. ఎందుకలా నోరు పారేసుకుంటున్నాడు? తనకసలు వ్యక్తిత్వమే లేనట్లు, మనసే లేనట్లు ఎన్ని మాటలంటున్నాడు. కళ్ళల్లో నీరు చిప్పిల్లుతుండగా, భావోద్వేగాన్ని మునిపంట అదిమిపట్టింది.

''మీకు అంతగా కష్టమైతే చెప్పండి నేను కూడా సంపాదిస్తాను''

అప్పుడు...'' ఇంకేదో అనబోతున్న మాధవిని చూసి పకపక నవ్వాడు రవి. ఆ నవ్వు ఎంత ఎగతాళిగా ఉందంటే, ఆమెకు ఆ క్షణాన ఉరివేసుకోవాలన్నంత కసి వచ్చింది.

నవ్వుతూనే ''నువ్వు సంపాదిస్తావా? ఎం.ఏ చదివిన నేనే గవర్నమెంటు ఆఫీసులో గుమాస్తాగిరి చేస్తున్నాను. ఇంటర్ చదివిన నీకెవరిస్తారు ఉద్యోగం? ఆమాత్రం అర్హతతో ఉద్యోగం సంపాదించి సంసారం భారం ఏం మోసేస్తావు?''

''చదువుతానంటే మీరు ఒప్పుకున్నారా? లేకపోతే నేనూ పెద్ద చదువులు చదవలేనా?'' గాద్గదికంగా వస్తోంది ఆమె మాట.

''ఆహా! చదువు. నీ తెలివితేటలకి పై చదువులు కూడానా? ఇంటి ఖర్చులు ఎలా చెయ్యాలో తెలియదుగానీ, పై చదువులు!'' అతని ప్రతి మాటలోనూ ఎగతాళి ధ్వనిస్తోంది.

ఆమె భావాలను పట్టించుకోకుండా మళ్ళీ తనే అన్నాడు. ''నిజంగా నీకు అంత చేవ వుంటే ఈరోజు ఖర్చు చేసిన ఐదు వందలు సంపాదించు చూస్తాను. నెల కాదు రెండు నెలలు టైం ఇస్తాను సంపాదించగలవా?'' బొటనవేలుని పైకి చూపి అడుగుతూ, తిరిగి ఆ వేలును క్రిందకు వంచి ''ఊహు!'' అంటూ నవ్వాడు.



## చెదరిన బంధం

**అమృతా అరోరా గురించి ఈమధ్య పత్రికల్లో చాలా వార్తలొచ్చాయి. అమీషాపటేల్ సోదరుడు అస్మిత్‌పటేల్‌తో చెట్టాపట్టాలేసుకుని తిరిగిన అమృతా వివిధ కారణాల వల్ల తమ 'ఫ్రెండ్‌షిప్'కి గుడ్‌బై చెప్పినట్టు చెవులు కొరుక్కుంటున్నారు సినీజనాలు. ఈ విషయం గురించి అమృతాని అడిగితే నిజమేనంటోంది. 'మా ఇద్దరి మధ్య తీవ్రమైన విభేదాలొచ్చాయి. మళ్ళీ మేం కలవడం అసాధ్యం' అంటోంది అమృతా. సినిమాల్లోగే హీరోహీరోయిన్ల మధ్య ఎప్పుడు అనుబంధం చిగురిస్తుందో, ఎప్పుడు వాడిపోతుందో ఎవ్వరికీ తెలియదు. బిగ్ హిట్ కోసం చూస్తున్న అమృతా మరో బాయ్‌ఫ్రెండ్ కోసం అన్వేషిస్తోంది. వీరిద్దరి మధ్య నెలకొన్న అగాధానికి కారణమేమిటో త్వరలోనే తెలుస్తుంది.**

తన భావాలను కించపరుస్తూ తననే అవమానిస్తున్నాడో లేక అలా మాట్లాడ్డం వల్ల అతని అహాన్ని, పురుషాహంకారాన్నీ సంతృప్తిపరచుకుంటున్నాడో అర్థం కాలేదామెకు. కానీ అతను అన్న మాటలు ఆమెలో పౌరుషాన్ని రేపాయి. అతను వేసిన సవాలుకి ప్రతిగా జవాబు ఇవ్వాలనుకుంది. కానీ మిన్నకుండిపోయింది.

''ఈ పుస్తకాలు తీసుకెళ్ళి ఎక్కడైనా నాకు కనబడని చోట తగలెట్టు. అవి నా కంటపడితే బూడిదలో పోసిన పన్నీరులా ఐదు వందలే నా కంటికి కనపడతాయి'' అంటుండగా-

''రవీ! రవీ!'' అంటూ గుమ్మం దగ్గర పిలుపు వినబడింది. గబగబా అడుగులు వేస్తూ గుమ్మం దగ్గరికి వెళ్ళాడు రవి. వెళ్ళిన వాడు రెండు నిముషాల్లో తిరిగివచ్చి బట్టలు మార్చుకున్నాడు. వంటింట్లో ఉన్న మాధవి దగ్గరికి వచ్చాడు.

''గిరి వచ్చాడు. ఇద్దరం బయటికి వెళ్తున్నాం. వచ్చేసరికి లేటవుతుంది. తలుపులు జాగ్రత్తగా వేసుకో'' అంటూ ఆమె ముఖం అయినా చూడకుండా బయటకు వెళ్ళిపోయాడు.

అతని వెనుకే వెళ్ళి తలుపు గెడవేసి బెడ్‌రూమ్‌లోకి వచ్చింది మాధవి. అప్పటివరకూ అణచుకున్న దుఃఖం పొంగిపొర్లింది. ఏడుస్తూ మంచంపై వాలిపోయింది.

**కె. విజయభాను**

మధ్యతరగతి కుటుంబంలో పుట్టింది మాధవి. తండ్రి సాదాసీదా గవర్నమెంటు ఉద్యోగి. మాధవి, ఉష ఇద్దరే సంతానం. ఇంటర్ చదువుతుండగా వచ్చింది రవివాళ్ళ సంబంధం. పెళ్ళిచూపులే కదాని ఒప్పుకుంది. కానీ ఆమె అదృష్టమో, దురదృష్టమో సంబంధం కుదిరిపోయింది. ''ఇంకా ఇంటరే కద నాన్నా చదువుతున్నాను. నాకు పై చదువులు చదవాలని ఉంది. మంచి ఉద్యోగం చెయ్యాలని ఉంది. నాకు అవకాశం కల్పించండి'' అని తండ్రిని ఎంతో ప్రాధేయపడింది.

''మంచి సంబంధం. కుర్రాడు గవర్నమెంటు ఉద్యోగి. మనం ఇస్తానన్న కట్నానికి కూడా ఒప్పుకున్నారు. మళ్ళీ ఇటువంటి సంబంధం వస్తుందని దీన్ని వదిలెయ్యలేము. నీ వెనుక ఉష కూడా వుందిగా! నేను రిటైరయ్యే లోపు మీ ఇద్దరి పెళ్ళిళ్ళూ చేసెయ్యాలని నా ఆశ. ఇక నీ చదువంటావా అబ్బాయి ఒప్పుకుంటే పెళ్ళయ్యాకయినా చదువుకోవచ్చు'' వణుకుతున్న ఆయన కంఠంలోని వేదనకు తలవంచింది మాధవి.

లక్కీగా ఇంటర్ పరీక్షలు అయ్యాకనే ముహూర్తం కుదిరింది. భర్తను ఎలాగైనా ఒప్పించి డిగ్రీ చదవాలని ఆశపడింది. కానీ ఆమె ఆశ ఎప్పటికీ తీరదని అతన్ని దగ్గరగా పరిశీలించిన తరువాత అర్థమయింది ఆమెకు. పెద్ద చదువులు చదివిన భార్య అంటే అతనికి చిరాకు. నరనరాన పురుషాహంకారం జీర్ణించుకుపోయిన మనిషి. భార్య అంటే వంటింటి కుందేలనే అతని భావన. స్త్రీ ఏ పనీ చేయలేదనీ, మగవాడు ప్రక్కన లేనిదే ఆమె పనికిరాదనీ, భార్యను ఎప్పుడూ కాలి క్రిందే అణచి ఉంచాలి అనేదే అతని ఆలోచన.

పెళ్ళయిన కొత్తనుండే ఒక ప్రణాళిక తయారు చేసి, ఆ విధంగానే ఆమె నడుచుకోవాలని, ప్రవర్తించాలనీ నిర్దేశించాడు. ఇంటి ఖర్చు ప్రతీదీ లెక్కరాయాలని ఒక పుస్తకం పెట్టాడు. అది బడ్జెట్టు కోసమో, పొదుపు కోసమో కాదనీ, తనది చేతకానితనమని ఎత్తి చూపించాలనేదే అతని అభిప్రాయమని ఆమెకు బాగా తెలుసు. వంట ఏం చెయ్యాలో రోజూ అతనే చెప్తాడు. ప్రతి విషయంలోనూ ఆమెను తక్కువ చేసి మాట్లాడ్డం ద్వారా ఆమెలో పొగరు పెరగకుండా మేనేజ్ చేస్తున్నానని సంతోషపడిపోతూంటాడు. ఆఖరికి బొట్టుబిళ్ళలు కొనుక్కోవాలన్నా అతన్ని అడిగే ఆ రెండు రూపాయలూ ఖర్చుపెట్టాలి.

తన మనసులో ఉన్న కోరికను ఒకరోజు అతను

మంచి మూడ్‌లో ఉండగా చూసి అడిగింది మాధవి. ''నేను డిగ్రీ చదవాలని ఆశపడుతున్నా నండీ. మీకు నేను కాలేజీకి వెళ్ళి చదవడం ఇష్టం లేక పోతే కరస్పాండెన్స్ కోర్స్ అయినా చేస్తాను. ఏమం టారు?'' ఎంతో ఉత్సాహంగా అడిగింది.

''నాకు ఇష్టం లేదు'' అంటూ మంచంపై అటు తిరిగిపోయాడు రవి.

''అది కాదండీ డిగ్రీ అయినా చదివితే నేను కూడా ఏదో ఒక ఉద్యోగం చేసుకో వచ్చు. మనకు పిల్లలు పుట్టినా ఆదాయం సరిపోతుంది. ఏదో వేన్నీళ్ళకు చన్నీ ళ్ళలా...'' ఇలా సాగిపోతున్న ఆమె, ఒక్క సారిగా అతను లేచి కూర్చుని అరవడంతో భయభ్రాంతురాలై ఆగిపోయింది.

''ఊరుకుంటున్నాను కదాని తెగ వాగు తున్నావేమిటి? నాకు ఇష్టం లేదని చెప్పాను కదా. అయినా డిగ్రీ చదివించాలని అనుకు నేవాడ్నే అయితే బాగా చదువుకున్న అమ్మాయినే చేసుకుందును కదా! మళ్ళీ నాకు ఈ ఖర్చొకటా? ఆడవాళ్ళు ఎక్కువ చదివితే నేను ఇష్టపడను. భార్యగా ఇంటి ఖర్చులు, చాకలి పద్దులు రాసుకోవడం తెలిసిన అమ్మాయి కావాలనుకున్నాను. కొద్దో గొప్పో నాగరికత తెలిసినదయితే చాలనుకుని నిన్ను సెలెక్ట్ చేసుకున్నాను. అర్థమయ్యిందా? ఇంకెప్పుడూ ఈ విషయం నా దగ్గర ప్రస్తావించకు'' కఠి నంగా అని మళ్ళీ అటు తిరిగి పడుకు న్నాడు రవి.

ఆ రాత్రి ఆమె ఎంతగా ఏడ్చిందో ఆమె తలదిం డుకు మాత్రమే తెలుసు. ఎందుకంటే ఏమీ జరగ నట్టే ఆమెను బాధపెట్టానన్న ఆలోచన కూడా లేకుండా హాయిగా గుర్రుపెట్టి నిద్రపోయాడు రవి.

అటు తర్వాత మాధవి ఎప్పుడూ చదువు విషయం ఎత్తలేదు రవి దగ్గర.

ఈరోజు పక్కింటి లలిత మార్కెట్టుకు వెళ్తూ మాధవిని తోడు తీసుకెళ్లడా నికి వచ్చింది. మాధవి రాలేనని చెప్పినా బ్రతిమాలి తీసుకెళ్ళింది.

సూపర్‌మార్కెట్‌లో కావల్సిన సరకులు కొన్నారు ఇద్దరూ. ఇంటికి తిరిగి వచ్చేద్దామనుకుని నడుస్తున్నారు బస్‌స్టాప్‌కి. అంతలోనే ఒక్కసారిగా ఆగిపోయింది లలిత. ఎందుకాగావని అడిగిన మాధవితో ''మధు! చూడు అక్కడ బుక్ ఎగ్జిబిషన్ పెట్టారు. నాకు పుస్తకాలంటే ఎంత ప్రాణమో! నీక్కూడా ఇష్టమే కదా. ఒక్కసారి చూసి వద్దాం'' అంది రోడ్డుకు అవ తల వైపున ఉన్న మీటింగ్ హాల్‌ని చూపిస్తూ.

మీటింగ్ హాల్ బయట రంగు రంగులతో పెద్ద బ్యానర్ కట్టి ఉంది 'బుక్ ఎగ్జిబిషన్' అని. అవి చూస్తూనే మాధవికి కూడా మనసు లాగింది. ఆమెకు పుస్తకాలంటే ఎంతో ఇష్టం. పెళ్ళికాక ముందు ప్రఖ్యాత రచయితలు, రచయిత్రులు రాసిన కథలు, నవలలు, కవిత్వాలు ఎన్నో చదివేది. తను కూడా వాటి నుండి స్ఫూర్తి పొంది చిన్న చిన్న కథలు, కవిత్వాలు రాసేది. కాని వాటిని ఎప్పుడూ ప్రచురణకు పంపలేదు.

టైం చూసుకుంది మాధవి. మధ్యాహ్నం 12 గంటలవుతోంది. రవి సాయంత్రం 5 గంటలకు గానీ రాడు. కాబట్టి ఫర్వాలేదు అనుకుంటూ లలిత వెంట ఉత్సాహంగా 'బుక్ ఎగ్జిబిషన్'లోకి నడిచింది. అక్కడ ఎన్నో మంచి పుస్తకాలు ఉన్నాయి. ప్రఖ్యాత రచయితల గ్రంథాలు లెక్కలే నన్ని ఉన్నాయి. వాటిలో కొన్నయినా కొంటే బావుండునని అన్పించింది. కానీ భర్త ఏమం టాడో అని ఆలోచనలో పడింది. ఈలోగా లలిత వెయ్యి రూపాయల పుస్తకాలు కొనేసింది. ''ఏమిటి మధూ! నువ్వు కూడా తీసుకో. చాలా మంచి గ్రంథాలున్నాయి. మళ్ళీ ఇటువంటివి దొర క్కపోవచ్చు'' అంటున్న లలిత మాటలకు ఆలోచ నల నుండి బయటపడింది. 'ఏదయితే అయిందిలే. ఆయన్ను నెమ్మదిగా ఒప్పిం చవచ్చు' అనుకుని తనకు బాగా నచ్చిన పుస్తకాలు కొన్నది. బిల్లు చూస్తే గుండె గుభేలుమంది మాధవికి. 'ఐదు వందలు'. ఇంట్లో భర్త వేసే ఐదు వందల రకాల చిందులు గుర్తొచ్చాయి.


ఎలాగో ధైర్యం చేసి కొనేసింది మాధవి. తిరిగి ఇంటికి వచ్చేటప్పటికి మధ్యాహ్నం మూడు గంటలయింది. గబగబా భోజనం చేసింది. ఆమెకు ఎంతో ఉత్సాహంగా వుంది. భర్త వచ్చే లోపే ఒకసారి ఆ పుస్తకాలను తనివితీరా చూసుకుని తర్వాత అతనికి కనబడ కుండా దాయాలని అనుకుంది. అతని మూడ్ బాగున్నప్పుడు ఈ విషయం చెప్పొచ్చని అనుకుంది. బయట తిరిగి వచ్చిందేమో చిరాగ్గా అన్పించి మొహం కడుక్కోవడానికి బాత్‌రూమ్‌కి వెళ్లింది.

డూప్లికేట్ కీతో తలుపు తీసుకుని ఎప్పుడొచ్చాడో కుర్చీలో కూర్చుని టేబు ల్‌పై వున్న పుస్తకాలు చూస్తున్నాడు రవి ఆమె తిరిగి వచ్చేటప్పటికి. అతని మొహంలో కనిపిస్తోన్న కోపాల్ని చూసి గుండె ఆగిపోయినంత పనయింది మాధ వికి.

అదిగో అప్పుడు రవి మొదలుపెట్టిన

## ఆత్మవిశ్వాసం

**ఏం జరిగినా ఎలాంటి ఎమోషన్స్‌కీ లోనుకాకుండా ఉండడం చాలా కొద్దిమందికే సాధ్యం. సినిమా ఇండ స్ట్రీలో జయాపజయాలు తారల మనఃస్థితిని ప్రభావితం చేస్తాయి. 'పైసా..' చిత్రం బాక్సాఫీస్ దగ్గర ఫెయిలంది కదా నీవు బాధపడడం లేదా?'అని యుక్తాని అడిగితే అలాంటిదేం లేదంటోంది. 'నేను అనుకున్నట్టుగా ఆ చిత్రం రాలేదు. అందుకని ఆ చిత్రం విజయం గురించి ఏమీ ఆలోచించలేదు' అంటోంది. తన చేతిలో ఇప్పుడు నాలుగు హిందీ చిత్రాలు, మరికొన్ని విదేశీ చిత్రాల ఆఫర్లు ఉన్నాయని చెప్పే యుక్తా అన్నిరకాల క్యారెక్టర్లు చేయాలని ఉందంటోంది. తనలో ఉన్న టాలెంట్‌ని పెంచుకునేందుకు యాక్టింగ్ అకాడమీలో చేరాలనుకుం టున్నట్టు చెబుతోంది. ఇలాంటి కోర్సులు చేయడం వలన ఆత్మవిశ్వాసం పెరుగుతుందంటోంది.**



గొడవ ఇప్పుడు మాధవి ఏడ్చే వరకూ కొనసాగింది.

భర్త వచ్చేటప్పటికి వంట చేసి లేకపోతే పెద్ద రాద్ధాంతం చేస్తాడని గుర్తుకు వచ్చి, ముఖం కడుక్కొని వచ్చి వంట మొదలుపెట్టింది మాధవి. వంట చేస్తోందే కానీ ఆమె మనసు, మెదడు వేరే దిశలో ఆలోచిస్తున్నాయి.

'నాకు సంపాదన చేతకాదంటాడా? మళ్ళీ అమ్మానాన్నల్ని ఆడిపోసుకుంటాడు. ఎందుకని తను ఇంత అవమానం భరించాలి? ఏదో ఒకటి చెయ్యాలి. తనూ సంపాదించగలనని నిరూపించాలి. ఏం చెయ్యాలి? ఉద్యోగం చెయ్యడానికి అతను ఒప్పుకోడు. అయినా సరే తనను తాను నిరూపించుకోడానికైనా ఎక్కడో ఒకచోట ఉద్యోగం సంపాదించాలి' అని నిర్ణయించుకుంది.

ఆ రాత్రి ఇంటికి వచ్చిన రవి ఏడ్చి, ఏడ్చి ఉబ్బిపోయిన ఆమె ముఖాన్నీ, కళ్ళనూ చూసి కూడా పట్టించుకోలేదు. ఆడవాళ్ళపై జాలి పడితే నెత్తికెక్కుతారని అతని భావన. ఆమె ఇటువంటి విషయాలకు ఏనాడో అలవాటుపడిపోయింది.

మరునాడు రవి ఆఫీసుకి వెళ్ళిపోగానే పక్కింటి నుండి న్యూస్ పేపర్ తెచ్చుకుంది. క్లాసిఫైడ్ ఉద్యోగప్రకటనలు చూసింది. అన్నింటికీ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసినవాళ్ళే కావాలి. కొన్నింటికి కనీస విద్యార్హత డిగ్రీ. ఇవేమీ తన దగ్గర లేవు. న్యూస్ పేపరు తిరిగి పక్కింట్లో ఇచ్చేసి వస్తుండగా వీధి చివరన ఉండే కాన్వెంట్‌లో చదువుతున్న పక్కింటి వాళ్ళ పిల్లలు భోజనానికి రావడం చూసింది. మెరుపులాంటి ఆలోచన వచ్చింది ఆమెకు. ఆ స్కూల్లో ఎల్‌కేజీ, యుకేజీ చెప్పే టీచర్లు పదవ తరగతి, ఇంటర్ చదివిన వాళ్ళేనని గుర్తుకొచ్చింది. 'నేను కూడా ట్రై చేస్తేనో?' అనుకున్నదే తడవుగా తయారయ్యి ఆ స్కూలుకు వెళ్ళి ప్రిన్సిపాల్‌ను కలిసింది మాధవి. విషయం విన్న ప్రిన్సిపాల్ ఆమెవంక ఆశ్చర్యంగా చూసింది. ''ఇది ఏప్రిల్ నెలమ్మా! ఇంకో రెండు వారాల్లో యాన్యువల్ పరీక్షలు ప్రారంభవుతాయి. ఇప్పుడు టీచర్స్‌ని రిక్రూట్ చేసుకోము. నీ బయోడేటా ఇచ్చి వెళ్ళు జూన్‌లో పిలుస్తాము'' అంది.

తన ఆత్రుతలో నెలను కూడా గుర్తుపెట్టుకోకుండా వెళ్ళి అడిగినందుకు సిగ్గుపడింది మాధవి. జూన్ నెలలో పిలుస్తారు. కానీ రవి రెండు నెలల్లో ఐదు వందలు సంపాదించాలని పందెం కాసాడు. తను ఓడిపోవాలా? పందెం సంగతి అతను మర్చిపోయాడు. కానీ గాయపడ్డ తన మనసు ఎలా మర్చిపోగలదు?

ఇంటికి తిరిగి వచ్చింది నిరాశగా. కానీ ఏదో చెయ్యాలని మనసు ఉత్సాహపడుతోంది. పరిపరి విధాల ఆలోచించింది. ఈలోపు ఎదురింటి పిన్నిగారు కాఫీపొడికి అప్పుకోసం వచ్చింది. ఆవిడ పేరు అన్నపూర్ణమ్మ. ఈ వీధిలోనేకాక ముందు రెండు, వెనుక రెండు వీధుల్లో కూడా మంచి పేరుంది ఆవిడకి. అందరితో కలుపుగోలుగా వుంటుంది. సలహాలు ఇవ్వడంలో మంచి దిట్ట.

ఆవిడ అడిగినదానికన్నా కొంచెం ఎక్కువ కాఫీ పొడే ఇచ్చింది మాధవి. ''రేపు తిరిగి ఇచ్చేస్తానమ్మాయ్'' అన్న ఆవిడ మాటకు ''అదేం మాట పిన్నిగారూ, తిరిగి ఇవ్వనవసరం లేదు. మీరు నాకేమయినా పరాయివాళ్ళా?'' అంది మాధవి.

ఆ మాటతో చాటంతయ్యింది ఆవిడ ముఖం. ఇదే మంచి సమయమనుకుని ఆవిడ్ని కూర్చోబెట్టి మాటల్లోకి దింపింది. ఆ మాటా ఈ మాటా మాట్లాడాక ''పిన్నిగారూ! ఇంట్లో నాకేమీ తోచడం లేదండీ. ఇలాగే వుంటే బద్ధకం పెరిగిపోతుంది. నలుగురు పిల్లలకి ట్యూషన్ చెబితే బావుంటుందనుకున్నాను. కానీ ఎవర్ని అడగాలో, ఏమిటో'' అంటూ అర్థోక్తిగా ఆగిపోయింది మాధవి.

''దాందేముందమ్మాయ్. మన వీధిలో అందరికీ నేనే చెబుతానుండు. మాట సాయమేగా. మన వీధిలో, అవతల వీధుల్లో కూడా కాన్వెంట్ పిల్లలు బాగానే వున్నారు'' అంది.

''అది కాదండీ. ఇది ఏప్రిల్ నెల. పరీక్షలు ప్రారంభమవుతాయి. ఇప్పుడెవరైనా నా దగ్గర చేర్పుతారా? నేనయినా జూన్ నెలలో ప్రారంభిద్దును. కానీ ఇప్పట్నుంచే అలవాటు పడితే వేసవిలో కూడా చెప్పొచ్చుకదా''ని అంటూ ఆగింది.

తను మాట్లాడిన మాటే తనకే సరిగా అర్థం కాలేదు. ఆవిడకేమైనా అర్థమయి వుంటుందా అని ఆవిడ ముఖ కవళికలు గమనించింది. ఇదేమీ ఆవిడ పట్టించుకోలేదు.

''నేనున్నాను కదమ్మాయ్. రేపటెల్లుండికల్లా నీ దగ్గరికి గంపెడుమంది పిల్లల్ని చేర్చనూ!'' అంటూ వెళ్ళిపోయిందావిడ.


ఆవిడ వెళ్ళాక ఆలోచనలో పడింది మాధవి. 'ఏదో భోళాతనంగా తనిచ్చిన కాఫీపొడికి ఉబ్బిపోయి చెప్పిన మాటలు కానీ, నిజంగా సంవత్సరం చివర్లో ఎవరొస్తారు తన దగ్గరికి ట్యూషన్‌కి?' ఇలా ఆలోచించగానే నిరుత్సాహం ఆవహించేసింది ఆమెను. మనసు బాగోలేదని మంచం మీద పడుకుంది కాస్త నిద్రపోదామని. ఎంత ప్రయత్నించినా నిద్ర రాలేదామెకి.

విసుగ్గా లేచి కూర్చుంది. టేబుల్‌పై నెలక్రితం రవి తెచ్చిన వారపత్రిక రెపరెపలాడుతూ కన్పించింది. కాస్త రిలీఫ్‌గా వుంటుందని ఆ పుస్తకం తీసుకుని మళ్ళీ మంచంపై పడుకుంది. పత్రిక పేజీలు తిప్పుతోంది. కానీ మనసు ఎక్కడో ఉంది. పత్రికపై మనసు నిలవడం లేదు. పోనీ నిన్న తను కొన్న పుస్తకాలు చదవొచ్చు కదా. వాటికోసం ఎన్ని చీవాట్లు తిన్నదో తను. ఆ పుస్తకాలు గుర్తురాగానే వాటి మీదకి మనసు మళ్ళింది. పత్రిక పేజీలు తిప్పుతూ, ఆ ఆలోచన రాగానే బీరువాలో వున్న పుస్తకాల దగ్గరికి వెళ్దామని చేతిలో ఉన్న వారపత్రిక మూసెయ్యబోయి, ఆ పేజీ చూసి ఆగిపోయింది మాధవి. ఆ పేజీలో కథల పోటీ అని వుంది. కథ ఏ అంశాల మీద రాయొచ్చో, ఎన్ని పేజీలు వుండాలో మొదలైనవన్నీ రాసి వున్నాయి. అది చదవగానే ఎప్పుడో తను రాసిన కథలు గుర్తొచ్చాయి ఆమెకు.

'నేను కూడా ఒక కథ రాస్తేనో?' అనుకుంది. ఎంతో ఉత్సాహంగా అన్పించింది ఆమెకు. ఏ కథ రాయాలా అని ఆలోచించింది. ఎన్నో ఆలోచనలు వచ్చాయి. కానీ సంతృప్తికరంగా అన్పించలేదు. చివరికి ఆమెకు వచ్చిన ఆలోచన ఎంతో బాగుందనిపించింది. 'నా కథనే రాస్తేనో?' అనుకున్నదే తడవుగా మొదలుపెట్టాలనిపించింది. మళ్ళీ పత్రిక తెరిచి ఆ పేజీ అంతా చదివింది. చివరి పేరా చదివేటప్పటికి ఏడుపొచ్చినంత పనయ్యింది. ఆ వారపత్రిక నెల కిందటిది. కథలను పోటీకి పంపించాల్సిన చివరి తేదీకి ఇంకో మూడు రోజులే టైముంది.

'ఉదయం నుండీ అంతా ఓటమే కనబడుతోంది. నా బ్రతుకు ఇంతేనేమో?' అనుకోగానే కళ్ళలో నీరు సుడులు తిరిగింది. అయినా తమాయించుకుంది. పోటీలో గెలుపొందుతుందా లేదా అన్నది తరువాత ప్రశ్న. వచ్చిన అవకాశాన్ని వినియోగించుకోవాలనుకుంది. 'కానీ ఒక్క రోజులో కథ రాయగలనా?' అని తనను తాను ప్రశ్నించుకుంది. ఆమె మనసు, అంతరాత్మ ధైర్యం చెప్పినట్లనిపించింది.


'కథ రాయాలంటే కాగితాలు, పెన్ను కావాలి. పోస్టు చేయడానికి



కవరూ, స్టాంపులూ కావాలి. తన కథ హైదరాబాదు చేరాలంటే రేపే పోస్టు చేయాలి. ఆఖరు తేదీకి చేరుతుంది' అనుకుంటూ కేలండరు వైపు చూసింది. ఈ మూడు రోజుల్లో పబ్లిక్ హాలిడేస్ గానీ, ఆదివారాలు గానీ లేవు. తృప్తిగా తల పంకించింది. తల దువ్వుకుని, చీర మార్చుకుంది. కావల్సిన సామాగ్రి కొని తీసుకురావడానికి బయలుదేరేముందు డబ్బులు తీసుకునేందుకు బీరువా దగ్గరికి వచ్చింది.

## సెలీనా బాధ

**షూటింగ్‌లతో చాలా బిజీగా ఉన్న సెలీనాజైట్లీకి రెస్ట్ కావాలని డాక్టర్లు చెప్పారట. 'ఖేల్' సినిమా షూటింగ్‌లో ఉన్న సెలీనాకి అకస్మాత్తుగా జ్వరం రావడంతో కొంచెం అప్‌సెట్ అయిందిట. సునీల్‌షెట్టి, అజయ్ జడేజాలు హీరోలుగా నటిస్తున్న ఈచిత్రం కోసం సెలీనా చాలా కష్టపడుతున్నట్టుంది. తెలతెలవారకముందే ఆమె షూటింగ్‌ల కోసం పరుగులుపెడుతోంది. ఈ సినిమాలో మంచి గ్లామర్ పాత్రలో కన్పించనున్న సెలీనా చిన్నచిన్న శారీరక ఇబ్బందులతో షూటింగ్‌కి దూరం కావడం చాలా బాధగా ఉందంటోంది. అందుకే శరీరం సహకరించకపోయినా కొంచెం ఆలస్యమైనా షూటింగ్‌లకి క్రమం తప్పకుండా హాజరవుతోంది.**



కాగితాలు, పెన్ను ఇంట్లో వున్నాయి. కానీ అవి వాడబుద్ధి కాలేదామెకు. కారణం అవి రవి కష్టార్జితంతో కొన్నవని అతను వెక్కిరిస్తాడు. మరి అతను సంపాదించిన డబ్బు ఎందుకు వాడాలి. బీరువా దగ్గర ఆలోచిస్తూ నిలబడిపోయిన ఆమెకు ఏదో గుర్తొచ్చిన దానిలా ప్రక్కగదిలోకి నడిచింది. అక్కడ చిన్నపెట్టెలో ఉన్న పర్సును బయటకు తీసింది. జిప్ తీసి అందులో ఉన్న డబ్బులు బయటకు తీసి లెక్కపెట్టింది. సరిగ్గా నలభైతొమ్మిదిన్నర వుంది అందులో. సంక్రాంతికి పుట్టింటికి వెళ్ళినపుడు ప్రయాణ ఖర్చులకు తండ్రి ఇచ్చిన డబ్బులో మిగిలాయి అవి. సమయానికి ఆ డబ్బులు గుర్తు వచ్చినందుకు తనను తానే అభినందించుకుంది మాధవి. స్టేషనరీకి వెళ్ళి కావాల్సిన కాగితాలు, ఒక పెన్ను కొనుక్కుంది. ఇంకా ముప్పై ఆరున్నర మిగిలింది ఆమె దగ్గర.

ఆమెలో నూతనోత్సాహం పరుగులు తీసింది. భర్త వస్తే అతనికి ఈ విషయం తెలియకూడదని నిర్ణయించుకుని సాయంత్రం ఆరు గంటలకు టైంపీస్‌లో అలారం పెట్టి రాయడం మొదలుపెట్టింది. తాను మధ్యాహ్నం భోజనం చేయలేదన్న విషయం కూడా మర్చిపోయి రాయడంలో మునిగిపోయింది. సాయంత్రం ఆరు గంటలకు అలారం కొట్టింది. కథంతా మరలా ఒకసారి రాసినంత వరకూ చదువుకుంది. సగం కూడా కాలేదు. కానీ నిరుత్సాహపడలేదామె. భారం భగవంతునిపైనే వేసింది. పేపర్లు, పెన్ను తన చిన్న పెట్టెలో అడుగున భద్రపరచి వంట కార్యక్రమంలో పడింది.

రాత్రి ఏడు గంటలు దాటాక వచ్చాడు రవి. స్నానం చేసి వచ్చి హాల్లో కూర్చుని టీవీ పెట్టుకున్నాడు. మాధవి అతనితో ఏమీ మాట్లాడలేదు. భోజనం వడ్డించి చిన్నగా దగ్గింది. ''ఇదో సిగ్నల్ అన్నమాట మాట్లాడ్డానికి. ఎంత పౌరుషమో?'' గొణుగుతూ వచ్చి భోజనం చేసి లేచాడు. ఆమె కూడా భోజనం ముగించి బెడ్‌రూంలోకి వెళ్ళి పడుకుంది. రవి టీవీ దగ్గర కూర్చున్నాడన్న మాటేగానీ మాధవి ముభావంగా వుండటం అతన్ని ఎంతో చిరాకు పెట్టింది. మాట్లాడాలని అన్పించినా తను తగ్గకూడదని నిర్ణయించుకుని బెట్టుగానే కూర్చున్నాడు.

రాత్రి ఎనిమిదిన్నరకు గిరి వచ్చాడు. ''మా ఆవిడ ఊరెళ్ళిందిరా. సెకండ్ షో సినిమాకు వెళ్తున్నాను. నీకు వీలుంటే రా!'' అన్నాడు.

మాధవి అలకతో చిరాగ్గా ఉన్న రవి బట్టలు మార్చుకుని ''సినిమాకు వెళ్తున్నాను తలుపులు జాగ్రత్తగా వేసుకో'' అని చెప్పి వెళ్ళిపోయాడు.

తలుపులు వేసి వచ్చి కాగితాలు, పెన్ను తీసుకుని టేబుల్ దగ్గర కూర్చుంది మాధవి. రాయడం మొదలుపెట్టింది. ఈసారి కూడా అలారం పెట్టడం మర్చిపోలేదామె. అర్ధరాత్రి పన్నెండు గంటలకు అలారం మోగింది. కథలో మునిగిపోయిన మాధవి ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చింది. ఒకసారి రాసినంత వరకూ చదివింది. కథ ముప్పావు వంతు అయిపోయింది.

కాగితాలు, పెన్నూ తిరిగి పెట్టెలో పెట్టేసింది. పన్నెండున్నరకు తిరిగి వచ్చాడు రవి. అడుగుల చప్పుడు వినగానే తలుపు తీసింది మాధవి. ఆమెను చూసి ఆశ్చర్యపోయాడు. నిద్రకళ్ళులా అన్పించలేదు ఆమె కళ్ళు. అంటే తన కోసం ఎదురు చూస్తూ కూర్చుందా? ఆ ఆలోచన రాగానే ఆమెపై ప్రేమ పొంగింది అతని హృదయంలో. ఆమెను అనాలోచితంగా బాధపెట్టినందుకు లోలోన పశ్చాత్తాపం మొదలయ్యింది. మాధవి ఏమీ మాట్లాడకుండా వెళ్ళి పడుకుంది. రవి కూడా కాళ్ళు కడుక్కుని వచ్చి నిద్రకుపక్రమించాడు.

మరునాడు భర్త ఆఫీసుకి వెళ్ళిపోయాక కథను ముగించింది మాధవి. టైం చూసుకుంది. మధ్యాహ్నం ఒంటిగంటయ్యింది. భోజనం

ముగించి తయారయి పోస్టాఫీసుకి బయల్దేరింది. కథ రాసిన పేపర్లు, హోమీ పత్రం జతపరచి కవరులో పెట్టి, వెయిటేజికి సరిపడా స్టాంపులు కొని పోస్ట్ చేసింది. ఇప్పుడు ఆమెకెంతో తృప్తిగా వుంది. మనసంతా తేలికగా వుంది.

మాధవి ఇంటికి తిరిగి వచ్చేసరికి మధ్యాహ్నం రెండున్నరయింది. ఇంట్లోకి అడుగుపెడ్తూ ఎదురింట్లోకి చూసింది. అన్నపూర్ణమ్మగారి వాటా తాళం వేసి వుంది. నవ్వుకుంది ఆమె. 'పాపం పెద్దావిడ, పిల్లల్ని తీసుకొస్తానంది కానీ అది ఈ టైంలో జరిగే పనేనా' అనుకుని లోపలికి వెళ్ళి తలుపు వేసుకుంది. ఆమెకు ఎంతో అలసటగా అన్పించింది. మంచం తనను పిలుస్తున్నట్టుగా అన్పించింది. మంచంపై వాలి కళ్ళు మూసుకుంది. ఎప్పుడు నిద్రపట్టిందో తెలియకుండానే నిద్రలోకి జారిపోయింది.

''మాధవీ! మాధవీ'' అని అరుస్తూ ఎవరో తలుపు దబదబ బాదుతోంటే ఉన్నట్టుండి ఉలిక్కిపడి లేచింది. తలుపు తీసి చూసిన ఆమెకు ఆనందాశ్చర్యాలతో నోట మాట రాలేదు. అన్నపూర్ణమ్మగారి వెనక దాదాపు ఇరవైమంది పిల్లలు వున్నారు. ''లోపలికి పదండర్రా'' అంటూ మాధవిని చూసి చిరునవ్వుతో లోపలికి వచ్చిందామె. మాధవి ఇంకా ఆశ్చర్యం లోంచి బయటపడకుండానే...

''ఇదిగో అమ్మాయ్! ఈ పదిమందీ మన వీధి పిల్లలు. ఈ ఐదుగురూ మనముందు వీధిలోని పిల్లలు. ఈ ఐదుగురూ మన వెనుకవీధిలో వాళ్లు. ఈ చంటిది నా మనవరాలు. ఈ పిల్లల్ని పొగెయ్యడానికి వీళ్ళ తల్లిదండ్రుల్ని ఎంత కష్టపడి ఒప్పించాననుకున్నావ్. పరీక్షలకు పిల్లల్ని బాగా చదివిస్తావనీ, సులువుగా చదివే పద్ధతులు నేర్పిస్తావనీ చెప్పాను. అయినా కొంతమంది ఆలోచించారు. అప్పుడు నువ్వు వేసవిలో కూడా చెప్తానని అన్న మాటలు గుర్తొచ్చాయి. మిగతా ట్యూషన్ సెంటర్లు వేసవి సెలవుల్లో పనిచేయవు కదా. పిల్లల అల్లరితో మీరు విసిగిపోవాల్సిన అవసరం లేకుండా వేసవి సెలవుల్లో కూడా ఆ అమ్మాయి సమ్మర్ స్కూల్ నడిపినట్లు నడుపుతుంది. ఎన్నో విషయాలు నేర్పిస్తుంది అని ఒప్పించి తీసుకొచ్చాను. మరి వీళ్ళను నీ దగ్గరే ఉండేలా చూసుకోవడం నీ బాధ్యతేనమ్మాయ్. ఇదిగో ఇది నా మనవరాలు సంధ్య. దీనికి మాత్రం నేను ఫీజు ఇవ్వలేను. ఏమంటావ్?'' అనర్గళంగా సాగిన ఆమె ఉపన్యాసం నుండి తేరుకున్న మాధవి...

''అలాగేనండీ. మీ మనవరాలి దగ్గర ఫీజు తీసుకుంటానా? ఎంత మాట! ఈ పిల్లల బాధ్యత ఇక నాది. మీకు చెడ్డ పేరు రానివ్వను. నాకోసం ఇంత శ్రమ తీసుకున్నందుకు చాలా థాంక్స్'' అంది ఆమెను కృతజ్ఞత నిండిన కళ్ళతో చూస్తూ.

మనవరాలికి ఫీజు లేకుండా ఎదురింట్లోనే ట్యూషన్ కుదిరినందుకు మురిసిపోతూ వెళ్ళిపోయిందావిడ.

ఆ సాయంత్రం ఎన్నడూలేని ఆనందాన్ని అనుభవించింది మాధవి. పిల్లల్ని పరిచయం చేసుకుని వారితో స్నేహాన్ని పెంచుకుంది. రాత్రి 7 గంటలకు ఇంటికి వచ్చిన రవి హాలునిండా ఉన్న పిల్లల్ని చూసి ఆశ్చర్యపోయాడు. విసుగ్గా ఏదో అనబోతూ మాధవి ముఖం చూసిన అతను ఆశ్చర్యపోయాడు. ఎంతో సంతోషంగా ఉంది ఆమె. పెళ్ళయిన సంవత్సర కాలంలో ఆమెను అంత ఆనందంగా చూడ్డం అదే మొదటిసారి. ఏమీ అనకుండా లోపలికి వెళ్ళిపోయాడు.

మర్నాడు తన దగ్గర మిగిలిన ఇరవై నాలుగు రూపాయలా యాభై పైసలతో ఒక బ్లాక్ బోర్డు, నాలుగు చాక్‌పీసులు కొన్నదామె. ఆనాటి నుండి ఆమె లోకమే మారిపోయింది. పిల్లల్ని ఎంతో శ్రద్ధగా పరీక్షలకు చదివించింది. రవి వచ్చిన తరువాత కూడా ఎనిమిదిన్నర వరకూ ట్యూషన్ జరిగేది. ఆ సమయంలో ఆమెలోని ప్రతిభను చూసి లోలోపల ఎంతో గర్వపడనారంభించాడు అతను. పిల్లల పరీక్షలు అయిపోయాయి. అయినా సమ్మర్ ట్యూషన్ కొనసాగుతూనే వుంది.

విద్యార్థులతో ఎంతో సంతోషంగా వుండే మాధవి, రవి దగ్గర మాత్రం ముభావంగానే వుంటోంది. తన మాటలు ఆమెనెంత బాధపెట్టాయో అర్థం కాసాగింది రవికి. తన మాటలకు గాయపడే ఆమె ట్యూషన్ మొదలుపెట్టిందని అర్థమయ్యింది. పిల్లలు ఇళ్ళకు వెళ్ళగానే ఎంతో నిస్సత్తువగా, అలసటగా అన్పించేది ఆమెకు. ఏదో తిన్నాననిపించి అలసటగా మంచంపై వాలిపోయేది. ఆమె దూరంగా వుండే కొద్దీ మాధవి అంటే ప్రేమ పెరిగిపోతోంది రవికి.

రోజూలాగే రవి ఆఫీసుకి వెళ్ళగానే వచ్చేసారు పిల్లలు. వాళ్ళకు దేశభక్తి గేయాలు నేర్పుతోంది మాధవి. ఇంతలో పోస్ట్ అన్న కేక వినబడి బయటికి వచ్చిందామె. ఆమె చేతిలో ఒక కవరు పెట్టి, మనియార్డరు ఫారం మీద సంతకం పెట్టమని ఇచ్చాడు పోస్ట్‌మేన్. సంతకం చేస్తూ అమౌంటు చూసిన ఆమెకు ఉన్నఫళంగా ఎగిరి గంతేయాలన్పించింది. 2500 రూపాయల మనియార్డరు అది. లోపలికి వచ్చింది డబ్బు తీసుకుని. కవరు చించి చదివింది. కథల పోటీలో తన కథకు రెండో బహుమతి వచ్చింది. ఆనందాతిరేకంతో నాట్యం చేయాలన్పించింది ఆమెకు. డబ్బు, కవరు తన పెట్టెలో దాచింది. రవికి ఏమీ చెప్పలేదు. వారం తర్వాత తన కథ పడిన సంచిక కొని తెచ్చుకుంది మాధవి. కథ చదువుతుంటే ఆనందంతో ఆనంద భాష్పాలు రాలడాన్ని నివారించలేకపోయిందామె. తన పేరును మరీ మరీ చూసుకొని మురిసిపోయింది.

ఆరోజుతోనే రవి, మాధవిల గొడవ జరిగి రెండు నెలలయ్యింది. రాత్రికి లేటవుతుందని, ఇన్స్‌పెక్షన్ వర్క్ వుందని ఉదయాన్నే చెప్పి వెళ్ళాడు రవి. ఆ వర్క్ ఏదో ఈరోజే తగలాలా అని బాధగా అనుకుంది. ఆ సమయంలో భర్తపై తాను గెలిచానన్న ఆలోచన రాలేదు ఆమెకు. విచిత్రంగా. రవితో ఆ సంతోషాన్ని పంచుకోవాలనీ, అతని కౌగిట్లో వాలిపోవాలనీ మనసు మరీ మరీ కోరుతోంది.

కానీ రవికి ఎదురుపడి మాట్లాడాలన్నా, ఈ విషయం చెప్పాలన్నా ఎందుకో బెరుకుగా అన్పించింది. తాను కథ రాయగా మిగిలిన చివరి కాగితం తీసుకుని రవికి ఒక ఉత్తరం రాసింది. తన కథ పడిన వారపత్రిక సంచిక, దానిపై ఈ ఉత్తరం, 2500 రూపాయల్ని ఒక కవరులో పెట్టి టేబుల్ మీద పెట్టింది. అవి ఎగిరిపోకుండా పేపర్ వెయిట్‌ను ఉంచింది.




రవికోసం రాత్రి 11.30 గంటల వరకూ మేలుకునే ఉంది. బాగా అలిసిపోవడం వలన ఆమెకు తెలియకుండానే గాఢనిద్రలోకి జారిపోయింది. అర్ధరాత్రి ఒకటిన్నరకు వచ్చాడు రవి. డూప్లికేట్ కీతో తలుపు తీసుకుని వచ్చాడు. బెడ్‌రూమ్‌లో ఆదమరచి నిద్రపోతున్న భార్యను తదేకంగా చూస్తూ ఉండిపోయాడు. ఇంతలో అతని చూపు టేబుల్‌పై రెపరెపలాడుతున్న కాగితంపై పడింది. డబ్బులున్న కవరు ప్రక్కనపెట్టి ఉత్తరం చదవడం ప్రారంభించాడు.

ప్రియమైన మీకు,

మీరన్న మాటలకు నా మనసు ఎంతో గాయపడింది. అందుకే అలా ప్రవర్తించాను. ట్యూషన్ పెట్టింది కూడా అందుకే. ఆ విషయం మీకూ తెలుసని నాకు తెలుసు. కానీ మీరు వద్దని గొడవ పెట్టి వుంటే అదీ వదిలేసే దాన్నేమో. కానీ ఆ విషయంలో నాకు సహకరించినందుకు మీకు నా కృతజ్ఞతలు. ఈరోజు నేనెంతో సంతోషంగా వున్నాను.

## సుష్మిత ఆనందం

**మాజీ అందాలసుందరి సుష్మితాసేన్ ఇపుడు చాలా హేపీగా ఉంది. పెంపుడుకూతురు రేనీతో కలిసి లైఫ్‌ని ఎంజాయ్ చేస్తోంది. అయితే ఈమధ్య ఆమె వెన్నునొప్పితో బాధపడుతున్నట్టు వార్తలొచ్చాయి. ఆ విషయం గురించి అడిగితే 'అది నిజమే. నా రేనీ నాకు తోడుగా ఉంటే ఎలాంటి ఇబ్బందులు నా దరిచేరవు. రేనీతో నాకు అనుబంధం బాగా పెరిగిపోతోంది. రేనీ లేకుండా ఒక్క క్షణం కూడా నేను ఉండలేకపోతున్నాను' అంటోంది సుస్. పిల్లలతో గడపడం అంటే అలాగే ఉంటుంది మరి! అంటున్నారంతా. నటించడం కన్నా ఇలాంటి జీవితమే తనకి బాగుందని చెబుతున్న సుష్మిత లైఫ్‌స్టయిల్ ఎవ్వరికీ అంతుచిక్కడం లేదు.**


మీరు నాతో గొడవ పడినందుకు, నేనేమీ సంపాదించలేనని అన్నందుకు ఉక్రోషంతో నన్ను నేను నిరూపించుకోవాలని కథల పోటీకి ఒక కథ రాసి పంపాను. ఆ పోటీలో నాకు రెండవ బహుమతి వచ్చింది. దాని విలువ 2500 రూపాయలు. (పైన కవరులో పెట్టాను). ఈ గెలుపు నిజంగా నాదికాదు. మీది. ఇంతకన్నా ఏం రాయాలో నాకు పాలుపోవడం లేదు. నేను గెలిచానని చెప్పడానికి ఈ ఉత్తరం రాస్తున్నానని అనుకోవద్దు. నా సంతోషం మీతో పంచుకోవాలని నా ఆశ. కానీ మీకు ఎదురుపడి నా మనసులోని భావాలు చెప్పేటంత స్వాతంత్ర్యం లేదు మీ దగ్గర నాకు. అందుకే ఈ ఉత్తరం.

మీ

మాధవి.

ఎన్నో చెప్పలేని భావాలను ఆ చిన్ని ఉత్తరంలో చదవగలిగాడు రవి. వారపత్రిక తీసుకుని సోఫాలో కూర్చుని చదవడం మొదలుపెట్టాడు. కథంతా మాధవిదేనని అర్థం అయ్యింది. కానీ ఆమె భర్త పాత్రను కించపర్చలేదామె. అతనితో తను కావాలనుకున్న అనుబంధాన్నీ, స్నేహాన్నీ, స్వేచ్ఛనూ ఆ కథలోని భర్త పాత్రకు వర్తింపజేసి, ఆ పాత్రను ఎంతో ఔన్నత్యంగా తీర్చిదిద్దిందామె. కథ పూర్తి చేసి ఏదో తెలియని భావాల ప్రకంపనల్లో కొట్టుకుపోయాడు రవి. వారపత్రికనూ, ఉత్తరాన్నీ, కవరునూ మాధవి ఎలా పెట్టిందో అలాగే యథాస్థానంలో వుంచి పేపర్ వెయిట్ పెట్టేశాడు. తెల్లవారుఝామున లేవడానికి మాధవి పెట్టుకున్న అలారం కట్టేసి, ఆమె మంచం దగ్గరికి వచ్చాడు. అమాయకంగా నిద్రపోతోన్న భార్యను చూసి ప్రేమతో, మోహంతో పొంగిపోయింది అతని మనసు. ఆమెను ముద్దుపెట్టుకోవాలన్న కోరికను చాలా కష్టపడి కంట్రోల్ చేసుకున్నాడు ఆమెకు నిద్రాభంగం అవుతుందేమోనని. మంచంపై పడుకోకుండా వెళ్ళి సోఫాలో పడుకున్నాడు. తెల్లవారే లేచి స్నానం చేసి మాధవిని లేపకుండా ఆఫీసుకి వెళ్ళిపోయాడు.

ఉదయం పది గంటలకు ఉలిక్కిపడి లేచింది మాధవి. టైం చూసి అదిరిపడింది. 'అలారం మోగడం ఎలా తెలియలేదు? ఆగిపోయిందా?' అనుకుంటూ టేబుల్‌పై వున్న అలారం పీస్‌ని చేతిలోకి తీసుకుని చూసింది. అది ఆఫ్ చేసి ఉంది. భర్తకోసం గదులన్నీ చూసింది. నిన్నటి బట్టలు స్టాండుకి తగిలించి ఉన్నాయి. అంటే ఆఫీసుకి వెళ్ళిపోయారన్నమాట.



'అయ్యో! భోజనం వండలేదు. టిఫిన్ చెయ్యలేదు. పరగడుపునే వెళ్ళిపోయారే' అని బాధపడింది. ఒకవేళ మధ్యాహ్నం భోజనానికి వచ్చేస్తారేమో అనుకుని గబగబా స్నానం చేసి వంట కార్యక్రమంలో పడింది. రవికి ఇష్టమైన పప్పుదోసకాయ, బంగాళాదుంప వేపుడు, పెరుగు పచ్చడి చేసింది. టైం చూసేసరికి మధ్యాహ్నం పన్నెండు గంటలైంది.

అప్పుడు గుర్తొచ్చింది ఆమెకు ఉత్తరం, వారపత్రికల విషయం. ఒక్క ఉదుటున బెడ్‌రూమ్‌లో టేబుల్ దగ్గరికి పరుగు పెట్టింది. అవి రాత్రి తాను ఎలా పెట్టిందో అలాగే వున్నాయి. నిరుత్సాహం ఆవరించేసింది ఆమెను. వెనుతిరగబోయిన ఆమె కళ్ళను మూసేసాయి వెనుక నుండి రెండు చేతులు. భర్త స్పర్శను గుర్తుపట్టిన ఆమె ఆనందంతో వెనుతిరిగింది. మాధవిని రెండు చేతులతోనూ ఎత్తి గిరగిరా తిప్పేసాడు రవి.

''అమ్మో! కళ్ళు తిరుగుతున్నాయి'' అంటూ ఆమె గలగలా నవ్వుతుంటే తృప్తిగా కిందకు దించి ఆమె చేతిలో ఒక కవరు, స్వీట్స్ ప్యాకెట్లు, పూల కవరు పెట్టాడు. పూల కవరు తెరిచి చూసిన ఆమె మల్లెపూలను చూసి సిగ్గుల మొగ్గే అయ్యింది. స్వీట్స్ ప్యాకెట్లను టేబుల్‌పై పెట్టి పొడవుగా వున్న కవరు తీసి అందులో నుండి కొన్ని కాగితాలను బయటకు తీసిందామె. తేరిపార చూసిన ఆమె కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి. తన కళ్ళను తాను నమ్మలేక కలో నిజమో తెలియక భర్తవంక అయోమయంగా చూసింది ఆమె.

''కథల పోటీలో గెలిపొందినందుకు నా భార్యకు నేనిచ్చే కానుక'' ఆమె చెవి దగ్గర అతనన్న మాటలతో వెనుదిరిగి అతన్ని అల్లుకుపోయింది మాధవి. ఆమె చేతిలో డిగ్రీ అడ్మిషన్ పేపర్స్ రెపరెపలాడుతూ నవ్వుతున్నాయి. ఆమెను కౌగిలించుకునే రవి ''మధూ! నీ ఎడబాటు నాలో ఎంతో మార్పుని తీసుకువచ్చింది. ఈనాటి నుండి నేను నీకు భర్తనే కాదు, మంచి స్నేహితుణ్ణి కూడా. నన్ను నమ్ము'' అన్నాడు.

ఆ మాటలు ఆమె చేతిలో కళ్యాణి రాగాన్ని పలికించాయి.

కొంతసేపటికి ఏదో గుర్తొచ్చిన దానిలా అతని నుండి విడివడింది మాధవి. ''పిల్లలు వస్తారేమో నండి. తలుపు కూడా వెయ్యలేదు'' అంది సిగ్గుపడుతూ.

''నేను ఉదయం బయటికి వెళ్తూ అన్నపూర్ణమ్మగారి మనవరాలితో పిల్లలందరికీ కబురు పెట్టాను. ఈరోజు ట్యూషన్ లేదనీ, మా క్లాసు వేరే వుందని!'' అని చిలిపిగా అంటున్న అతన్ని మళ్ళీ అల్లుకుపోయింది ఆమె.

☆